## క్లుప్తంగా

### బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

నగరి: బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలని ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక పాఠశాల కాకవేడులో జరిగిన నేను బడికి పోతా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు బాలబాలికలందరూ బడిలో ఉండాలన్నారు. చదువుతో పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. 1,2 తరగతుల పిల్లలకు పలకలు, బ్యాగులు, పుస్తకాలు అందజేశారు. పాఠశాలలో చిత్రలేఖం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పౌర్ణమి వేడుకలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ఆవుదేవరనందీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అఖండ దీపాలు వెలిగించారు. స్వామివారికి అభిషేకాలు చేసి, అనంతరం విశేషాలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

### అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ వితరణ



అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ అందజేస్తున్న దాత దాసరి గణేష్, కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: మండలంలోని సీడీ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన దాసరి గణేష్ తన కుమార్తె చరణ్యశ్రీ జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం రూ. 20 వేలు విలువ జేసే కలర్ టీవీని సీడీపీఓ పద్మసునందకు అందజేశారు. ఈ సందర్భంగా దాత గణేష్ మాట్లాడుతూ చిన్నారులకు సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతో టీవీ వితరణ చేశానని చెప్పారు. సీడీపీఓ పద్మసునంద మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం దాతను అంగన్‌వాడీ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు. అలాగే రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు శామిని, వనజ, మంజుల, దామోదరం, చిన్నకుప్పారెడ్డి, లోకనాథం, బాబు ఆచారి, సుబ్రమణ్యం, భాస్కర్, బాబు, చంద్ర పాల్గొన్నారు.

### శ్రీకృష్ణుడికి పున్నమి హారతులు



గీతా మందిరంలో పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో ఉన్న శ్రీకృష్ణస్వామికి శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊయలలో పరుండబెట్టి 'జోఅచ్యుతానంద జోజోముకుందా.. లాలి పరమానంద రామనంద గోవిందా జో...జో' అంటూ గీతాలు ఆలపిస్తూ స్వామిని పవళింపజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### శ్రీసిటీని సందర్శించిన తిరుపతి ఎస్పీ

సత్యవేడు: తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్ శ్రీసిటీని సందర్శించారు. గురువారం రాత్రి మొట్ట మొదటి సారిగా శ్రీసిటీకి విచ్చేసిన ఆయనకు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలతో పాటు ఇక్కడ అనుసరిస్తున్న భద్రత విధానాల గురించి వివరించారు. ఉద్యోగులు, విద్యార్థులు, విదేశీ ప్రతినిధులు అధిక సంఖ్యలో ఉన్న శ్రీసిటీ రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి శాంతి భద్రతలపై సమీక్షించారు. పెండింగ్ కేసులు పరిష్కరించాలన్నారు. శ్రీసిటీ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరావు, సీఐ భాస్కర్, ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో న్యాయవాదుల యోగా



వెదురుకుప్పం: యోగా చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



నగరి: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



# భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగం

పుత్తూరు: భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగమని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే సంతోషకర జీవితాన్ని గడపగలమన్నారు. యోగా మాస్టర్ పర్యవేక్షణలో న్యాయవాదులు, ఔత్సాహికులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాల్‌టెక్నికల్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ కుమార్ రామకృష్ణపరమహంస, వివేకానంద, అబ్దుల్ కలాం, గాంధీజీ జీవిత విశేషాలను వివరించారు. యోగా మాస్టర్ పర్యవేక్షణలో అధ్యాపకులు, విద్యార్థులు ఆసనాలు వేశారు.

**రాచపాళెం పాఠశాలలో..**

స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం కుమారవేలు యోగాసనాలు వేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**యోగాతో వ్యాధినిరోధక శక్తి**

నగరి: యోగాతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యాపకులు, విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి భారత దేశం ఇచ్చిన అద్భుతమైన బహుమతి యోగా అన్నారు. యోగాతో వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. శారీరక, మానసిక రోగాలను నయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ భాస్కర్‌రాజు, ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, సుబ్రమణ్యం, పంకజ, రేవతి, మహేశ్వరి, సుహాసిని, గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో సీనియర్ న్యాయవాది సోమసుందరం యోగాడేను పురస్కరించుకుని యోగాసనాల గురించి వివరించారు. జడ్జి విష్ణువర్మ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో యోగాడేను పురస్కరించుకుని విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. ప్రిన్సిపల్ ఎ.సుబ్రమణ్యం రెడ్డి ధ్యానం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. యోగా సనాతనమని, దాని అవసరం శాశ్వతమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మానందం, అధ్యాపకులు పాల్గొన్నారు.



పుత్తూరు: ఆసనాలు వేస్తున్న జడ్జిలు రాఘవేంద్ర, జానకి

**యోగాతో రుగ్మతలు మాయం**

వెదురుకుప్పం: యోగతో అనేక రుగ్మతలు మాయమవుతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా 100 మంది విద్యార్థులకు యోగ శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానసికోల్లాసం, శారీరక దారుఢ్యానికి యోగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్రమం తప్పకుండా యోగ చేయడాన్ని అలవరచుకోవాలని సూచించారు. అలాగే అల్లమడుగు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ భరణినాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మంగళగౌరి, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు ప్రభాకర్‌రావు, భక్షు, అరుణ, రుష్మ, వెంకటేష్, శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**యోగాను విద్యతో అనుసంధానం చేయాలి**

కార్వేటినగరం: యోగాను విద్యతో అనుసంధానం చేయాలని డీఎం పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లోను, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది కూడా ఆసనాలు వేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఎం పురం ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి దశలో జ్ఞాపక శక్తికి యోగాసనాలు ఉపకరిస్తాయన్నారు. ప్రతి రోజూ యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరి, విద్యలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. అనంతరం రాజా కుమార రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూప మాట్లాడుతూ యోగా ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు సామాజిక వికాసం కూడా సాధ్యపడుతుందని, ప్రతి రోజు యోగా చేయడంతో శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**యోగాతో శారీరక దృఢత్వం**

గంగాధర నెల్లూరు: శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే యోగా ముఖ్యమని నెల్లేపల్లి ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని నెల్లేపల్లి పాఠశాలలో విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి యోగా అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మయ్య విద్యార్థులతో వివిధ యోగాసనాలు నేర్పించి అభ్యసించాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు యుగంధర్ ఆచారి, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మయ్య, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుత్తూరులో ధ్యానం చేస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



నగరి: జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో యోగా వేస్తున్న జడ్జి, న్యాయవాదులు



యోగాసనాలు నేర్పిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్య









నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, కార్వేటినగరం: డీఎం పురం ఉన్నత పాఠశాలలో యోగా ఆసనాలు వేస్తున్న విద్యార్థులు, పుత్తూరు: హెచ్ఎం కుమారవేలు యోగాసనం, కార్వేటినగరం: డిగ్రీ కళాశాలలో..

## తగ్గని డయేరియా

పాలసముద్రం: మండల కేంద్రంలో ప్రబలిన డయేరియా పెరుగుతోంది. దీంతో పలువురికి ఇంకా వాంతులు, విరేచనాలు అవుతూనే ఉన్నాయి. పాలసముద్రంలో జరిగిన గంగజాతర సందర్భంగా అంబలి సేవించి గ్రామస్తులు అస్వస్థత గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం కూడా గ్రామంలో డయేరియా బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. వైద్యాధికారులు గ్రామంలోని వారందరికీ పరీక్షలు చేసి, వైద్యం అందిస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అనిల్ కుమార్, వైద్యులు శ్రీవాణి తదితరులు పాలసముద్రం బీసీ కాలనీలో పర్యటించి, కలుషిత ఆహారం కారణంగా డయేరియా ప్రబలిందని చెబుతున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు మోహనకృష్ణ, లోకేష్, సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



బీసీ కాలనీలో పర్యటిస్తున్న జిల్లా అధికారులు

## సుబ్రమణ్యస్వామి ఆలయంలో చోరీ





దుండగులు పగులగొట్టిన హుండీ, బీరువా

కార్వేటినగరం: మండల కేంద్రంలోని కుమారగిరిపై ఉన్న శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కుమారగిరిపై ఉన్న శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి అర్చకులు రాత్రి యథావిధిగా పూజలు ముగిసిన అనంతరం తాళాలు వేసుకుని వెళ్లారు. శుక్రవారం వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు సుబ్రమణ్య స్వామి ఆలయంలోకి చొరబడి హుండీ పగలగొట్టి నగదు దోచుకున్నట్లు గుర్తించారు. అలాగే బీరువాను పగలగొట్టి, అందులోని విలువైన వస్తువులకు కూడా తీసుకెళ్లినట్లు గుర్తించారు. అలాగే మోటారు, సీసీ కెమెరాకు సంబంధించిన సీపీయూ బ్యాక్సును అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటకృష్ణ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం చిత్తూరుకు చెందిన వేలిముద్ర నిపుణులతో వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పర్సనల్ ఇన్‌చార్జిలను నియమించాలి

నగరి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జిలను నియమించాలని చిత్తూరు జిల్లా పీఏసీఎస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తుల సిపిళ్ళై, జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 37 సంఘాలకుగాను 11 సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జిలు ఉన్నారని, మిగిలిన 26 సంఘాలకు లేరన్నారు. ఈ కారణంగా వ్యాపార లావాదేవీలుస్తంభించాయన్నారు. ముఖ్యంగా పెట్రోల్ బంకు నిర్వహణ, బంగారు రుణాలు ఇవ్వడం, ఎరువులు కంపెనీ వారికి డీడీలు చెల్లించడానికి సంఘాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఉన్నతాధికారులు ఈ అంశంపై స్పందించి త్వరితగతిన 26 సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జిలను నియమించి, రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, రాష్ట్రనాయకులు సుబ్రమణ్యం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్రనాయుడు, జిల్లా సహకార్యదర్శి రామమూర్తి, పీఏసీఎస్ సిబ్బంది శేఖర్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా యూనియన్ నాయకులు

## గుమ్మడి కుతూహలమ్మకు ఘన నివాళి

గంగాధర నెల్లూరు: దివంగత నాయకురాలు డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మ 75వ జయంతి వేడుకలు శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గంగాధర నెల్లూరు మండలంలోని వింజం లక్ష్మీరెడ్డిపల్లి గ్రామంలో కుతూహలమ్మ భర్త మునిసిద్ధయ్య, కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనగంటి హరికృష్ణ కుటుంబ సభ్యులతో కలసి ఆమె సమాధి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ కుతూహలమ్మ లేని లోటు తీర్చ లేనిదన్నారు. వైద్యురాలిగా, రాజకీయ నాయకురాలిగా ప్రజలకు ఆమె చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా వింజం లక్ష్మీరెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ర్వంచ్ గోవిందయ్య, కుట్టి, యువరాజ్, భానుచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడి కుతూహలమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న హరికృష్ణ తదితరులు

## నేత్రపర్వంగా ఊంజల్ సేవ

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం శ్రీపద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. తదుపరి అంతర ప్రాకారంలో అమ్మవారిని ఊరేగింపుగా ఊంజల్ మండపానికి తీసుకొచ్చి ఉయ్యాలపై కొలువుదీర్చారు. వేదనాద కచేరి నడుమ ఊంజల్ సేవలో అమ్మవారు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు పర్యవేక్షించారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు, ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కార్వేటినగరం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట కూడలి వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కావనూరు గ్రామానికి చెందిన మునికృష్ణ, ప్రేమ్‌కుమార్ కార్వేటినగరం మీదుగా పళ్లిపట్టు వైపు వెళుతూ ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి చిత్తూరు నుంచి కార్వేటినగరం వైపుగా వస్తున్న కారును ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో వెళుతున్న మునికృష్ణ, ప్రేమ్‌కుమార్‌లకు గాయాలయ్యాయి. అదే విధంగా ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు రోడ్డుకు సమీపంలో ఉన్న సిగ్నల్ బోర్డును ఢీకొనడంతో కారు అద్దాలు పగిలిపోయాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ద్విచక్ర వాహనదారులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు.

## బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజాసామగ్రి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని ఏటుకూరిపల్లెలో ఉన్న బాటగంగమ్మకు శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, అంబలి పోశారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలిని నయ్యాడి వాయిద్యాలు, నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లి, అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం మహిళలు పాల బిందెలను గ్రామాల్లో ఊరేగించి, అమ్మవారిని పాలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన పసుపు, కుంకుమ, సుగంధభరిత పుష్పాలతో అమ్మవారిని అలంకరించి, భక్తులు దర్శనం కల్పించారు. భక్తులకు అంబలి, తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.